ప్రజాశక్తి

శనివారం 28 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ - 3 పున : ప్రారంభం

వార్త మెయిన్‌లో..

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

24 గంటలూ గ్రీన్ ఎనర్జీ అందించడమే లక్ష్యం

- రైతులకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్
- సూపర్ ఇసిబిసి శిక్షణా కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో/ మధురవాడ

24 గంటలూ నాణ్యమైన గ్రీన్ ఎనర్జీని రాష్ట్ర ప్రజలకు అందించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో సాగర్‌నగర్‌లో రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన సూపర్ ఇసిబిసి భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల సోలార్ విద్యుత్ కనెక్షన్లను కేంద్రం సాయంతో ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పిఎం కుసుమ్ పథకంలో భాగంగా వచ్చే వ్యవసాయ సీజన్‌కు రైతులకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు రాష్ట్రంలోని మూడు లక్షల వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ కనెక్షన్లను అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు మంత్రి తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ సాగర్‌నగర్‌లోని సూపర్ ఇసిబిసి భవనం ఇంధన సామర్థ్య నిర్మాణానికి ప్రతీకగా నిలిచే విధంగా ఉందన్నారు. లైన్‌మ్యాన్ నుంచి చీఫ్ ఇంజినీర్ల వరకు శిక్షణ ఇచ్చే విధంగా నిర్మించబడిన ఈ కేంద్రంలో స్కాడా, మిగతా 2లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో..

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. స్థాయీ సంఘం ఛైర్మన్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో 8 మంది స్థాయి సంఘం సభ్యులతో సమావేశం జరిగింది. 286 ప్రధాన అజెండా అంశాలతోపాటు 13 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 299 అంశాలను పొందుపరిచారు. వాటిపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 239 అంశాలు ఆమోదం పొందాయి. మిగిలిన 60 అంశాలను వాయిదా వేశారు. ఇంజినీరింగ్ విభాగం, రెవిన్యూ విభాగానికి సంబంధించి గుత్తలు, ఆశీలు, ఉద్యోగుల పరిపాలనాపరమైన అంశాలు, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఆమోదం పొందిన వాటిలో ఉన్నాయని, వాటిని చర్చించిన పిదప సభ్యులు పలు అంశాలకు ఆమోదం తెలిపారని ఛైర్మన్ పీలా మిగతా 2లో..

సాగర తీరంలో నిరసన తెలుపుతున్న యుజిడి కార్మికులు

బకాయి జీతాల కోసం

యుజిడి కార్మికుల నిరసన

వార్త 2లో..

అవయవదానంతో ఐదుగురి జీవితాల్లో వెలుగులు

వార్త 3లో..

ఆరుగురిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష

వార్త మెయిన్‌లో..

జివిఎంసి తాగునీటి కార్మికుల సమ్మె

వార్త 4లో..

పైడివాడ అగ్రహారంలో లే అవుట్ల వద్ద ఉన్న భవన నిర్మాణ సామగ్రిని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

పేదలకు సకల సౌకర్యాలతో పక్కా ఇళ్లు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వార్త 3లో..

జప్తు కాని కలెక్టర్ కారు, కుర్చీ, ఇతర వస్తువులు

అమీన్‌ను అడ్డగించిన కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి - లీగల్ న్యూస్

గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం విశాఖ జిల్లా కలెక్టర్ కారు, కుర్చీ, ఇతర వస్తువుల జప్తు విషయమై స్వాధీనానికి వెళ్లిన అమీన్‌ను కలెక్టర్ కార్యాలయ సిబ్బంది శుక్రవారం కార్యాలయంలోకి అనుమతించలేదు. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా విధులు నిర్వహించిన తాళ్లూరి రవికుమార్‌కు గౌరవ వేతనం చెల్లించలేదు. ఈ నిమిత్తమై విశాఖపట్నంలోని ఏడో అదనపు జిల్లా కోర్టులో ఆయన దావా వేశారు. అనంతర తీర్పు ప్రకారం కలెక్టర్ కారు, కుర్చీతోపాటు ఐదు వస్తువులను జప్తు చేయాల్సి ఉంది. ఎప్పటికీ కలెక్టర్ స్పందించకపోవడంతో శుక్రవారం కోర్టు అమీన్‌తో రవికుమార్ జిల్లా కలెక్టర్ ఆఫీసుకు జప్తు నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో కలెక్టర్ తన కార్యాలయానికి గొళ్లెం పెట్టి కాన్ఫరెన్స్ హాల్‌కి వెళ్ళిపోయినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. ఆ సమయంలో మహారాణిపేట సిఐ అమీన్ విధులను నిర్వహించకుండా అడ్డుకున్నట్లు రవికుమార్ తెలిపారు.

మళ్లీ శనివారం ఇదే కార్యాలయానికి జప్తు నిమిత్తం వెళ్ళనున్నట్లు తెలియజేశారు. ఇలా అడ్డుకుంటే కోర్టు వారిని పోలీస్ సహాయం కోరి జప్తు చేయనున్నట్లు రవికుమార్ తెలిపారు.

బ్లూమ్‌బెర్గ్ మేయర్స్ ఛాలెంజ్ - 2025 ఫైనలిస్ట్‌గా విశాఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక మేయర్స్ ఛాలెంజ్ - 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 నగరాలలో విశాఖ ఒకటిగా నిలిచింది. ఇదెంతో గర్వకారణమని జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నగరాల వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు బ్లూమ్‌బెర్గ్ మేయర్స్ ఛాలెంజ్ ఆరో ఎడిషన్ కార్యక్రమం జరుగుతోంది. 99 దేశాలకు చెందిన 630 నగరాలు ఈ పోటీలో పాల్గొనగా వాటిలో 33 దేశాలకు చెందిన 50 నగరాలు మాత్రమే ఫైనలిస్టులుగా ఎంపికయ్యాయి. విశాఖపట్నం నగరానికి కమ్యూనిటీ ఆధారిత వాతావరణ భద్రతను బలోపేతం చేసే వినూత్న ఆలోచనకు గాను ఈ ఎడిషన్‌లో చోటుదక్కింది.

సమ్మెను జయప్రదం చేయండి

మొదటి పేజీ తరువాయి..

24 గంటలూ గ్రీన్ ఎనర్జీ అందించడమే లక్ష్యం

ఆర్ఎంయు, ట్రాన్స్ఫార్మర్, మీటర్ టెస్టింగ్ ల్యాబ్‌లతో పాటు కొత్తగా నియమించబడిన ఉద్యోగులకు ఇండక్షన్ శిక్షణ కూడా ఇస్తారని తెలిపారు. ఈ కేంద్రాన్ని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపేలా, ప్రభావవంతంగా ఉపయోగపడేలా ఒక గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఆయన చేశారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ 13 వేల మెగావాట్లకు చేరినప్పటికీ రోజుకు 254 మిలియన్ యూనిట్ల సరఫరా చేసి డిమాండ్‌ను విజయవంతంగా తీర్చామన్నారు. కుసుమ్ పథకం కింద 3 లక్షల వ్యవసాయ సోలార్ పంపుల కనెక్షన్లను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని విశాఖపట్నం జిల్లాలో విద్యుత్ పిల్లరేజ్ అత్యల్పంగా ఉందని తెలిపారు. నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నాణ్యమైన విద్యుత్ అవసరమని చెప్పారు. ఎంపీ ఎం.శ్రీభరత్ రూఫ్ టాప్ సోలార్ అమలును వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, ఎపిఇపిడిసిఎల్ సిఎండి ఐ.పృథ్వీతేజ్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధ్ర ప్రసాద్, ఇపిడిసిఎల్ డైరెక్టర్లు, సీనియర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, 8వ వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు పాల్గొన్నారు. అలాగే మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పెద వాల్తేరులో ఏర్పాటు చేసిన స్కాడా భవనాన్ని, విశాఖ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి మొక్కలు నాటారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

విద్యుత్ శాఖలో వివిధ ప్రమాదాల్లో విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఇపిడిసిఎల్ పరిధిలోని సుమారు 20 మందికి సంస్థలో ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

గంటా కోసం అంతా పడిగాపులు

మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా షెడ్యూల్‌లో జరగాల్సిన సూపర్ ఇసిబిసి భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సకాలంలో రాకపోవడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహా సొంత పార్టీ ఎమ్మెల్యే గణబాబు, పలువురు ఐఎఎస్‌లు, అధికారులు అంతా విస్మయానికి గురయ్యారు. సకాలంలో కార్యక్రమం జరగకపోవడంతో గణబాబు గంటపాటు నిరీక్షించి వెనక్కి వెళ్లిపోయారు. గంటా శ్రీనివాసరావు సీనియర్ రాజకీయ నాయకుడు అయినందున ఆయన లేకుండా మంత్రి గొట్టిపాటి భవనాన్ని ప్రారంభించేందుకు ఇష్టపడలేదు. తుదకు 11 గంటలకు జరగాల్సిన కార్యక్రమం రెండు గంటల ఆలస్యంగా జరిగింది. 9 గంటలకే కార్యక్రమం వద్దకు చేరుకున్న పలువురు అధికారులు విసుగుచెందారు.

క్షమించండి: గంటా వేడుకోలు

తన నియోజకవర్గంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి పర్యటన ఉండడంతో అక్కడకు వెళ్లానని, అందుకే సకాలంతో తాను రాలేకపోయానని గంటా అన్నారు. తన వల్ల చాలా ఆలస్యం జరిగిందని చెబుతూ క్షమాపణలు కోరారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఇప్పినాయుడు, కె.శివప్రసాద్, మల్లయ్య నాయుడు, బి.రాము, బిఆర్ఎస్.శేషాద్రి, హేమావతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, యుసిడి పీడీ సత్యవేణి, సెక్రటరీ బివి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.పద్మజ, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్.రవి, పివివి.సత్యనారాయణ రాజు, గోవిందరావు, సంపత్ కుమార్, కె.శ్రీనివాసరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

బకాయి జీతాల కోసం యుజిడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుజిడి కార్మికులకు బకాయి ఉన్న రెండు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అప్పుఘర్ ప్లాంట్ వద్ద యుజిడి కార్మికులు నిరసన తెలిపారు. సముద్ర తీరంలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ జీతాలు ఇవ్వకపోవడం వల్ల బతకడం కష్టమవుతోందన్నారు. ఈ నెలలో స్కూల్స్ ప్రారంభం కావడంతో స్కూలు ఫీజులు, పుస్తకాలు కొనడానికి మరింత ఖర్చవుతోందన్నారు. కార్యక్రమంలో యుజిడి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఇ.ఆదినారాయణ, దేవుడు, సూరప్పడు, నరేష్, సతీష్, ప్రసాద్, జగన్, సత్తిబాబు పాల్గొన్నారు.

వినియోగదారుల కేసులో విజయం

- బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా కమిషన్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మధురవాడలో గ్లోబల్ ఎంట్రా పోలీస్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రెండు 2014లో అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టగా, ఇందులో ఫ్లాట్ కావలసినవారు పూర్తి సొమ్ము ముందుగా చెల్లిస్తే, ఏడాదిలోగా ఇంటిని నిర్మించి అప్పగించడం జరుగుతుందని చేసిన ప్రకటన మేరకు రాకేష్‌కుమార్‌శర్మ అనే వ్యక్తి 2011 చదరపు అడుగుల ఇంటికి పూర్తి సొమ్ము రూ. 45లక్షల 42 వేలు చెల్లించాడు. 2015 డిసెంబర్‌కి ఇంటిని అప్పగించాల్సి ఉండగా, ఏడు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంటిని అప్పగించకపోవడంతో రాకేష్‌కుమార్‌శర్మ తమను ఆశ్రయించారని, నేషనల్ కన్స్యూమర్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు పి.వికాస్ పాండే తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,ఏడాదిలో ఫ్లాట్ అప్పగించకుండా, 2021లో జిఎస్‌టి వగైరా ఖర్చులకు అదనంగా డబ్బు చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. దీంతో తమ కౌన్సిల్ తరపున జిల్లా వినియోగదారుల విభాగాల పరిష్కార కమిషన్ కు 2022లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుల వాస్తవాలను పరిశీలించి, కౌన్సిల్ బుధవారం తీర్పు చెబుతూ, బాధితునకు 45 రోజుల్లో ఫ్లాట్ అప్పగించాలని, అలాగే 2016 జనవరి ఒకటి నుంచి నెలకు రూ.6030 చొప్పున చెల్లించాలని, రూ.10 లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలని కౌన్సిల్ ఆదేశించిందన్నారు. 45 రోజులు దాటితే రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని కౌన్సిల్ జడ్జి తీర్పు చెప్పారని తెలిపారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాడార్ సిస్టం, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సవరణ చట్టాలను రద్దు చేయాలని, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే జాతీయ సమ్మెను, ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్, అధ్యక్షులు పి.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న రాడార్ సిస్టమ్‌ను రద్దు చేయాలన్నారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి యాప్‌లలో అమలు చేస్తున్న రాడార్ వ్యవస్థ డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతోందన్నారు. కార్యక్రమంలో బి.శేషు, కె.వేణు, జె.గోవింద్, ఎల్.రామకృష్ణ, జి.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలంటూ 45వ వార్డు నరసింహనగర్‌లో మున్సిపల్ కార్మికులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మర్రిపాలెంలో మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు సమ్మె పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ సెక్రటరీ ఒ అప్పారావు, జోన్ ప్రెసిడెంట్ ఎస్ శ్రావణ్‌కుమార్, జిల్లా నాయకులు యుఎస్ఎన్ రాజు, జోన్ నాయకులు ఎన్ ప్రకాషరావు, 45వ వార్డు మున్సిపల్ యూనియన్ నాయకులు వి సీతాలక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, రాజబాబు, మర్రిపాలెం క్లాప్ యూనియన్ నాయకులు సాధురావు, స్వామి, చిన్ని పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు

గిరిజన మహిళలపై దాడిని ఖండించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: సినిమా థియేటర్లో పనిచేయడానికి వచ్చిన గిరిజన మహిళను కులం పేరుతో దూషించి, ఉద్యోగం నుంచి తొలగించిన చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని, ఇందుకు బాధ్యులపై ఎస్సి,ఎస్టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబదరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బతుకుతెరువు కోసం అరకు,పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుండి వచ్చి, మిరాజ్ సినిమా థియేటర్‌లో పనిచేస్తున్న గిరిజన మహిళలు జె.జ్యోతి, ఎ.రిబకా,ఎస్. పైడిరాజులను థియేటర్ మేనేజర్‌గా ఉన్న జ్యోతి కావాలని గొడవ పెట్టుకుని, వారిని కులం పేరుతో తిట్టిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఎసిపిని కలవమని చెప్పారని, ఎసిపి ఫోర్త్‌టౌన్ సిఐ వద్దకు పంపించారని అక్కడ సిఐ గంటన్నర పాటు నిలబెట్టి మాట్లాడారని, కేసును వెనక్కు తీసుకోవాలని కోరారని ఆరోపించారు.

దీనిని కెవిపిఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. థియేటర్ మేనేజర్ జ్యోతి తదితరులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి,ఉపాధ్యక్షులు వై. రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు ప్రతినిధులు

ఖాతాదారుల ఆదరాభిమానాలతో ముందడుగు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 26వ మహాజనసభ శుక్రవారం ఎన్ఆర్ఐ కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. సమావేశానికి బ్యాంకు అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరాభిమానాలతో తమ బ్యాంకు అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తోందన్నారు. కేవలం బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటున్నామన్నారు. ఇప్పటికి 9 జిల్లాల్లో 34 శాఖలుగా విస్తరించి ఉందని, రానున్న కాలంలో మరిన్ని శాఖల ఏర్పాటుకి రిజర్వుబ్యాంకుకి దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికి రూ.1020 కోట్లు డిపాజిట్లను కలిగి, రూ.680 కోట్లు రుణాలను మంజూరు చేసి, రూ.11.20 కోట్లు నికర లాభంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న నలుగురు, ఇంటర్మీడియెట్ చదువుతున్న నలుగురు సభ్యుల పిల్లలకు ప్రశంసా పత్రాలతో పాటు,రూ.5 వేలు ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యుల షేరు ధనంపై 14 శాతం డివిడెండ ప్రకటించడంతో సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్ రామకృష్ణ, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, పాలకవర్గం సభ్యులు ఎం.రాఘవేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వర రావు, సిపి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జిఒ 114తో భవన నిర్మాణ రంగానికి ఊతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జిఒ 114 రియల్ ఎస్టేట్ రంగానికి గణనీయ ఉత్సాహం కలిగించే నిర్ణయంగా క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ వి.ధర్మేందర్,అధ్యక్ష కార్యదర్శులు అశోక్ కుమార్, వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా జారీ చేసిన జిఒ ద్వారా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్‌రూల్స్ 2017లో అనేక కీలక సవరణలు చోటుచేసుకున్నాయ న్నారు. ఈ జిఒతో నిర్మాణ ప్రక్రియలో పారదర్శకత పెరిగి, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ప్రాజెక్టులు రూపుదిద్దుకో నున్నాయని వారు అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీని నీరుగార్చారు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నీరుగార్చిందని వైసిపి దక్షిణ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. ఆశీలుమెట్ట కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న రాచపల్లి లక్ష్మికి తన సొంత నిధులు రూ.5 వేలు అందించారు.అనంతరం ఆయన మాట్లాడారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.
O.S. 1045/2024

Between:
Sri Bheemarasetty Murali Krishna, . . . Plaintiff

And:
1) Sri Bommika Ramarao, S/o. Latchumayya,
2) Sri Marlana Bhaskara Rao, S/o. Suri, . . . Defendants.

DEFENDANT NO.2:
Sri Marlana Bhaskara Rao, S/o. Suri, Railway employee, Pointsman-A, Operating Department, E.Co.Rly, Visakhapatnam residing at Dr.No. 58-2-38/1, Syam Nagar, Marripalem, Visakhapatnam-530018.

NOTICE

Please take notice that the above plaintiff filed a suit against you and another for recovery of a sum of Rs. 4,73,400/- (Rupees Four Lakhs and Seventy Three Thousand and Four Hundred only)) with interest and costs. The said matter stands posted to 13-08-2025. Therefore, you are required to attend before the captioned court at **10.30 A.M on 13-08-2025** in person or through your agent or Advocate, failing which, you will be set exparte and the matter will be decided on merits in your absence in favour of the plaintiff.

SRI S.S.VASU,
ADVOCATE &
EX.ADDL. PUBLIC PROSECUTOR
Visakhapatnam, VISAKHAPATNAM
Dt.25-06-2025 Ph.no: 9848523201

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL -CUM- I ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P. 301/2024

Between:
Divvela Znaneswara Rao.....Petitioner
And
Y.Sanni Babu and others
......Respondents

R-2: Gorla Ganeswari, W/o Murali, aged 35 years, Hindu, Owner of Auto B.No.AP/39/W/8776, Resident of Dr.No.19-24-29, RH Colony, Pedagantyada, Visakhapatnam-530044

NOTICE

Please take notice that the above O.P., stands posted to **04-07-2025** for notice to the 2nd respondent. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court.

If you not to appear on the said date the above matter will be decided expartee.

P.A.N. Raju
Advocate for the petitioner
Vizianagaram

పేదలకు సకల సౌకర్యాలతో పక్కా ఇళ్లు

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి
- గిడిజాల, పైడివాడ అగ్రహారంలో ఇళ్ల లేవుట్ల పరిశీలన

గిడజాల సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి- ఆనందపురం/ సబ్బవరం : రాష్ట్రంలోని పేదలందరికీ సకల సౌకర్యాలతో పక్కా ఇళ్లు కట్టిస్తామనిరాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్.టి.ఆర్. కాలనీల్లోని పెండింగ్ పనులను అతి త్వరలోనే పూర్తి చేసి ఇళ్లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. శుక్రవారం విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని గిడిజాల, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని పైడివాడ అగ్రహారం వద్ద గృహ నిర్మాణ లేఅవుట్లను స్థానిక ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్ బాబులతో కలిసి సందర్శించారు. నిర్మాణాల కోసం అందుబాటులో ఉంచిన ఇనుము, ఇసుక, ఇతర ముడిసరుకులను, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను అక్కడి తాజా పరిస్థితిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సభల్లో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేక తలెత్తిన లోపాలను సరిచేసి, నాణ్యమైన ఇళ్లను నిర్మించి పేదలందరికీ అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిసి, ఎస్‌సి లబ్ధిదారులకు రూ.50వేలు, మైదాన ప్రాంత ఎస్టీలకు రూ.75వేలు, గిరిజన ప్రాంత ఎస్టీలకు రూ.1లక్ష అదనపు సాయం అందిస్తామన్నారు. పిఎం ఆవాస్ యోజన పథకంలో గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతం వారికి 2 సెంట్లు స్థలం ఇస్తామన్నారు.

గిడిజాల, పైడివాడ అగ్రహారంలో పెద్ద లేఅవుట్లు వేసినా మౌలిక వసతులు లేవన్నారు. జలజీవన్ మిషన్, అమృత్ పథకాలను గత పాలకులు వినియోగించుకోలేకపోయారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వాటి గడువును కేంద్రం పెంచినందున సద్వినియోగం చేసుకుంటామన్నారు. వీలైనంత త్వరలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని,జీవీఎంసీ, వీఎంఆర్డీఏ నుంచి సహకారంలో తాత్కాలికంగా విద్యుత్, తాగునీటి వసతి కల్పిస్తామన్నారు.

గృహ నిర్మాణ లేఅవుట్లలో, ఇళ్ల నిర్మాణాల విషయంలో జరిగిన అవకతవకలపై లోతైన విచారణ చేయిస్తామని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.. సకాలంలో పనులు పూర్తి చేయని గుత్తేదార్లను అవసరమైతే తొలగిస్తామన్నారు. లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లు అర్హులకు ఇవ్వాలని అధికారులకు సూచించారు.. ఇళ్లు రానివారిని గుర్తించి పీఎంఏవైలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్ బాబు మాట్లాడుతూ త్వరితగతిన మౌలిక వసతులు కల్పించాలని, అదనపు ఆర్థిక సాయం మంజూరు చేసి పండగ వాతావరణంలో ఇళ్లను ప్రారంభించేందుకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సందర్భనలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ గ్రోవర్స్, ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గన్ రెడ్డి సోంబాబు, ఘట్టమనేని బోస్ బాబు,తాత్రాజు అప్పారావు బిఆర్‌బి నాయుడు, బంటుమిల్లి శ్రీనివాస్, బంటుబిల్లి గోవింద్, అధికారులు, నేతలు ఉన్నారు.

గిడిజాలలో ఫ్లెక్సీల ఫొటోలు గొడవ

ఆనందపురం : మండలంలోని గిడిజాల గ్రామంలో సమావేశ వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్ర మోడీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలు ు లేకపోవడంపై జనసేన, బీజేపీ నేతలు తీవ్రఅభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కూటమి పార్టీల మధ్య వాగ్వాదం రేగగా, జనసేన బిజెపి నాయకులు కార్యక్రమం మధ్యలోనే వెళ్లి పోయారు. దీనిపై జనసేన ఆనందపురం మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు మాట్లాడుతూ, భాగస్వామ్య పార్టీల నేతలకు తగిన గుర్తింపునివ్వని టిడిపి నేతల తీరు బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ఒప్పందానికి టిడిపి కట్టుబడి ఉండాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రతిభ చూపిన విద్యార్థులతో వెంకటరత్నం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తానన్న మాటను ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి, జార్ఖండ్ ఐజి క్రాంతికుమార్ నిలబెట్టుకున్నారు. ఇటీవల టెన్త్‌లో మంచి మార్కులతో సత్తా చాటిన టాపర్స్ ముగ్గురికి క్రాంతికుమార్ తల్లి వెంకటరత్నం శుక్ర వారం నగదు బహుమతులు అందజేశారు. టెన్త్‌లో పాఠశాల టాపర్ వి.సత్యఅలేఖ్యకు రూ.పది వేలు, రెండోస్థానంలో నిలిచిన సంజనకు రూ.ఐదు వేలు, మూడో స్థానంలోనిలిచిన షణ్ముఖరెడ్డికి రూ.మూడు వేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి రమణ, ఉపాధ్యాయులు, స్థానికులు మైలపల్లి షణ్ముఖరావు, పి శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు కాళ్ళ సన్నీ, ఎం సూర్య శ్రీనివాస్, జి సాయి, అశోక్ పాల్గొన్నారు .

బడి బాట ర్యాలీ

ప్రజాశక్తి - భీమునిపట్నం : మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మంగమారిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, పనికి ఎందుకు తొందర, చదువుకో ముందర, ఇల్లాలి చదువు, ఇంటికి వెలుగు నినాదాలతో ర్యాలీ సాగింది. హైస్కూల్ హెచ్‌ఎం, పద్మావతి, ఉపాధ్యాయులు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, శారద, రమ్య, పాల్గొన్నారు

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవిందరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వార్డు పరిధిలోని బిటిఆర్ కాలనీలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు.కార్యక్రమంలో డాక్టర్ చరణ్, టిబి. సూపర్వైజర్లు సత్యనారాయణ, మధు, సచివాలయ ఎఎన్ఎంలు జివి రమణి , అప్పలనర్స, మేరీ గ్రేసీ, టిబి .హెచ్‌వి సునీత, కమల, ఆశ వర్కర్లు స్థానిక నాయకులు ధనాజీ పాల్గొన్నారు.

సుజనా చౌదరికి పరామర్శ

ప్రజాశక్తి-సీతమ్మధార: విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి)ని విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి వైద్యుల సూచనలతో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను తాడిగడపలోని క్యాంపు కార్యాలయలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏడాది పాలనపై ఇరువురు నేతలు చర్చించారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ప్రజాశక్తి - సీతమ్మధార: నాణ్యమైన, తాజా కూరగాయలను విక్రయిస్తూ, వినియోగదారుల పట్ల రైతులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని మార్కెటింగ్ శాఖ డిడి రవికిరణ్ సూచించారు శుక్రవారం సీతమ్మధార రైతు బజారును సందర్శించారు. దుకాణాల వద్ద రైతులందరూ విధిగా పరిశుభ్రత పాటించాలని సూచించారు. తూనికలు, కొలతలు, ధరల విషయంలో కొనుగోలుదారుల నుంచి ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన టమోటాలు, ఉల్లిపాయలు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

అవయవదానంతో ఐదుగురి జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - అరిలోవ : కులవృత్తిని వద్దు అనుకున్నాడు.. తన సోదరుడిలానే పెయింఇంగ్ పనికి వెళ్లాడు. ఎంతో ఇష్టంగా చేస్తున్న పని అతని పాలిట యమపాశంలా మారింది. పనిప్రదేశంలో జరిగిన ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. అయితే పుట్టెడు దు్ఖంలోనూ ఆ కుటుంబం మంచి మనసు చాటుకుంది. కుమారుడి డి రెండు కిడ్నీలు, లివర్, రెండు కళ్లను దానం చేసి మరో ఐదు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపి, అందరితో అభినందనలు అందుకుంది.

భీమిలికి చెందిన మత్స్యకారు కుటుంబమైన ఎన్ ధనరాజు లక్ష్మీ దంపతులకు ఇద్దరు పిల్లల్లో చిన్నవాడైన పరుశురాం (22). బుధవారం గాయత్రి హాస్పిటల్ వెనక అపార్ట్మెంట్‌లో పెయింటింగ్ చేస్తుండగా, రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. గాయపడ్డ పరుశరాం ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో గురువారం సాయంత్రం విమ్స్ ఆస్పత్రికి తరలించారు.. విమ్స్ వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోవడంతో పరశురాంబ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. విషయాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా,బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి, వారి అనుమతితోనే పరశు రాం అవయవాలను సేకరించి, జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం శుక్రవారం ఉదయం రెండు కిడ్నీలు, లివర్, రెండు కళ్లను స్వీకరించి వేరు వేరు ఆసుపత్రికి తరలించారు

పరశురాం తల్లిదండ్రులను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

పరశురాం (ఫైల్)

ఘన వీడ్కోలు పలికిన విమ్స్ సిబ్బంది

పరుశురాం పార్థీవ దేహానికి విమ్స్ ఆసుపత్రి వైద్యులు ,సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ముందుగా జీవన్ దాన్ కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు పరుశురాం పార్థీవ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైద్యులు ,సిబ్బంది పార్థవ దేహంపై పూల వర్షం కురిపించి ఘన వీడ్కోలు పలికారు. పుట్టెడు దు్ఖంలో కుమారుడి అవయవాలను దానం చేసిన పరుశురాం తల్లిదండ్రులను విమ్స్ ఆస్పత్రి సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అంతక్రియలకు రూ.పదివేలను తల్లిదండ్రులకు అందజేశారు.

నేరాలు ఘోరాలు

బాల్ మిల్ మిషన్‌లో పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని గండిగుండం పంచాయతీలోని కోరమండల్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం ఉదయం ఘోరం చోటుచేసుకుంది. బాల్ మిల్ మిషన్‌లో పడి కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. పెందుర్తి జేఎన్ఆర్ఎమ్ కాలనీకి చెందిన ఓలేటి వెంకటరమణ (57) రెండేళ్లుగా గండిగుండంలోని పెయింట్స్ కంపెనీలో కూలిగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెయింట్ మిక్సింగ్ ట్యాంక్‌ను శుభ్రం చేయడానికి మిషన్‌లోపలికి దిగగా, అదే సమయంలో యంత్రం ఆన్ కావడంతో వెంకటరమణ శరీరం నుజ్జయిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు, సీఐ వాసునాయుడు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిఐ వాసనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై శివ దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణ స్వస్థలం చీడికాడ మండలం కోనాం గ్రామం. కుటుంబ పోషణ కోసం వలసవచ్చి ప్రమాదమరణం చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు దుర్మరణం

ప్రజాశక్తి-గొలుగొండ: ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్న సంఘటనలో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పాంగి కృష్ణమూర్తి నర్సీపట్నం మండలం లక్ష్మీపురం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. అక్కడి నుండి ప్రతిరోజు నడింపాలెం ఆశ్రమ పాఠశాలలో విధులకు రాకపోకలు సాగిస్తున్నారు. శుక్రవారం విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుండి బైక్‌పై బయలుదేరగా, కెడి.పేట పోలీస్ స్టేషన్ లింగంపేట దరి రామచంద్రపురం జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న మరొక బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మరణించాడు. కెడిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. గాయపడ్డ మరో ఇద్దరు యువకులను కెడి.పేట ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

14 మంది మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి-ఆనందపురం : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 14మంది నిందితులకు ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున రూ.1.40లక్షల జరిమానాను భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి స్వాతి భవానీ విధించారని స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం మత్తులోవాహనాలు నడుపుతూ వీరు పట్టుబడ్డారన్నారు.

గొట్టిపల్లిలో వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో శెట్టి బలిజ కులానికి చెందిన బుత్తల రాముడు (75) ఈ నెల 10న, మంగళవారం అదృశ్యమయ్యాడు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాముడు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయన మానసిక స్థితి సరిగా లేదన్నారు. 15రోజులకు పైగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సమాచారం తెలిస్తే 90001 43704, 99085 87031 మొబైల్ నెంబర్లకు సమాచారమివ్వాలని వృద్ధునిరెండో కుమారుడు ఆది కోరుతున్నాడు.

గంజాయి, మద్యాన్ని నియంత్రించండి

సిపికి ఫిర్యాదు చేస్తున్న అనూష

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 68వ వార్డులో గంజాయి, మద్యం బెల్ట్ షాపులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ వార్డుకార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్జీని కలిసి ఫిర్యాదు చేశారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం క్రాస్‌రోడ్డులో ప్రమాదాలు జరగకుంటా ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

బొజ్జా తారకం ఆశయసాధనకు కృషి

నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సామాజిక పోరాట యోధుడు బొజ్జా తారకం 86వ జయంతిని శుక్రవారం మూమెంట్ 21 ఆధ్వర్యంలో ఎయు అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాల సాధనకు బొజ్జా తారకం జీవితాన్ని త్యాగం చేశారని, రచయితగా, ఉపన్యాసకుడిగా ఎడిటర్‌గా, ఉద్యమకారుడిగా, లాయర్‌గా అట్టడుగు వర్గాల సామాజిక, రాజకీయ, విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. పోలీసులంటే భయపడుతున్న సమాజం కోసం 'పోలీసులు అరెస్టు చేస్తే' పుస్తకాన్ని రాశారన్నారు. దేశంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ రావటానికి తారకం కృషి త్యాగం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో భీమ్‌సేన వార్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బోరుగడ్డ మోహన్‌బాబు డాక్టర్ దేవా, విశాఖపట్నం ఆదివాసి భవన్ అధ్యక్షుడు ప్రసాదరావు, డాక్టర్ శిరీష్ డాక్టర్ కొండపల్లి రత్నారాజు, మూమెంట్21 కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ బి. మత్యుంజయ్, డాక్టర్ వుండ్రుకొండ హరీష్ బాబు, వరసాల మిలింద్ కుమార్, డాక్టర్.దేవానందం, డాక్టర్. తమనం శిరీష్ కుమార్, డాక్టర్ కృష్ణ కీర్తి పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

• విశాఖ ఎంపీ శ్రీభరత్

మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సీఐఐ యువ విభాగమైన యంగ్ ఇండియన్స్ (వైఐ) ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ వ్యాలీ స్కూల్‌లో యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. యువ పార్లమెంటేరియన్లను ఉత్తేజపరిచేలా తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 100కిపైగా ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్ వైజాగ్ చైర్ డాక్టర్ శ్రావణి , కోచైర్ బెల్లంకీవ కొడాలి ఛైర్ సుప్రియా సురపనేని నాయకత్వం వహించారు. పలువురు యంగ్ ఇండియన్స్ సభ్యులు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.

జిసిసి చైర్మన్‌ను కలిసిన అశోక్

శ్రావణ్‌తో అశోక్‌చక్రవర్తి

ప్రజాశక్తి -తగరపువలస : ఏపి గిరిజన సహకార సంస్థ చైర్మన్, టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిడారి శ్రావణ్‌కుమార్‌ను, జివిఎంసి రెండో వార్డు, టిడిపి ఎస్‌సి సెల్‌కు చెందిన నాయకుడు చెట్టి అశోక్‌చక్రవర్తి కలిశారు. శుక్రవారం విశాఖ నగరంలో న ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన శ్రావణ్ కుమార్‌ను కలిసిన భీమిలి నియోజకవర్గం, విశాఖలో జరిగిన మినీ మహానాడు సభల్లో గిరిజన సమస్యలపై ఎస్‌టి విభాగం ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్‌ను శాలువాతో అశోక్ చక్రవర్తి సత్కరించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

• సిఐటియు జోన్ మహాసభలో గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి

మహాసభలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ కార్మికులతో సమానంగా వేతనం చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో మల్కాపురం జోన్ మహాసభ కె. రమణ, బి.రాంబాబు, ఎన్.ఉమ అధ్యక్ష వర్గంగా నిర్వహించారు. మహాసభలో ముందుగా గడచిన మూడేళ్లలో మృతి చెందిన కార్మికులకు నివాళులర్పించారు. యూనియన్ ఆధ్వర్యంలో జోన్ పరిధిలోని ఏడువార్డుల్లో పోరాట విజయాలను కార్యదర్శి రమణ ప్రవేశపెట్టగా, మహాసభ ఆమోదించింది. అనంతరం సభలో నేతలు మాట్లాడుతూ, ఆప్కాస్‌లో విలీనం తర్వాత కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన, అనారోగ్యానికి గురైన కార్మికుల స్థానే వారి కుటుంబీకులకు ఉద్యోగావకాశం కల్పించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతమంది కార్మికుల మిస్సింగ్ వేతనాలు చెల్లించడం లేదని, కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో హామీలే తప్ప అమలు జరగడం లేదని మండిపడ్డారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ రద్దు, ఇతర కార్మికుల సమస్యలపై వచ్చేనెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల రెగ్యులరైజేషన్, కనీస వేతనాలపై మహాసభలో తీర్మానించారు. అనంతరం 23 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా ఆర్. లక్ష్మణమూర్తి అధ్యక్షులుగా కె. రమణ, ఉపాధ్యక్షులుగా డి రాము, బి. సూరిబాబు, డి రాంబాబు, ప్రధానకార్యదర్శిగా శ్యామ్,సహాయ కార్యదర్శి గా ఎన్.దేవి, ఎన్ ఉమ, సిహెచ్ లక్ష్మి ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎస్ కుమార్, బి శ్రీను, కోశాధికారిగా బి.రాంబాబు కమిటీ సభ్యులుగా సంతోషి, ఏసు, తిరుపతిరావు భూలోక రాధిక ఈశ్వరమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె..పెంటారావు, నాయకులు పి పైడిరాజు మాట్లాడారు. బి రాంబాబు వందన సమర్పణతో సభ ముగిసింది.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

• సిఎం చంద్రబాబు పాడేరు ఏజెన్సీ పర్యటనలోగా స్పష్టతనివ్వాలి

• ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -గాజువాక : వచ్చేనెల ఒకటిన పాడేరు ఏజెన్సీలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ లోగానే ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.చిన్నం నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు కే చిట్టి బాబు, సిటీ కమిటీ సభ్యులు దామోదర డిమాండ్ చేశారు. కంచరపాలెంలోని సంఘం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. చింతపల్లి, అరకు, అనంతగిరి పరిధిలోని బాక్సైట్ నిక్షేపాలను నాల్కోకు అప్పగించే ప్రయత్నంపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. జిఒ 3 ప్రయోజనాలు పునరుద్ధరణ, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై అరకు ఎన్నికల సభలో చంద్రబాబు హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఆదివాసీల ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందని మండిపడ్డారు. ఏజెన్సీలోని ఎర్రవరం,పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్టులను అదాని ప్రవేటు సంస్థలకు కారు చౌకగా అప్పగించే ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు..పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణంపూర్తికాలేదని, ఈ ఏడాది 100 సీట్లకు నేటికి అనుమతి ఇవ్వలేదన్నారు. .గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఆరోగ్య కార్యకర్తలను, ఏజెన్సీ పాఠశాలలలో భాషా వాలంటీర్లు, సిఆర్‌టిల రెన్యువల్స్, నియామకాలు లేక వందలాది పాఠశాలలు మూతబడినా ప్రభుత్వపరంగా తగు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు, వాలంటీర్లను నియమించి, పాఠశాలలను తెరిపించాలని కోరారు.

థైరాయిడ్‌తో కంటిచూపుపై ప్రభావం

డాక్టర్ లావణ్య మద్ది

ప్రజాశక్తి - ఆరిలోవ : థైరాయిడ్ అనగానే జుట్టు రాలడం, శరీర బరువు సమస్య, శక్తి స్థాయిలు, హార్మోన్ల అసమతుల్యత లాంటివే అని మనసులో మెదులుతుంది తప్పితే, ఈ వ్యాధి కంటిని కూడా ప్రభావితం చేస్తుందని తెలియక పోవచ్చని ఎల్‌వి. ప్రసాద్ నేత్ర విజ్ఞానసంస్థ, జిఎంఆర్ వరలక్ష్మీ క్యాంపస్ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య మద్ది అన్నారు. ఈ వ్యాధికి చికిత్స చేయకుండా వదిలేస్తే శాశ్వత దృష్టి నష్టానికి దారితీస్తుందన్నారు. ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. థైరాయిడ్ కంటి వ్యాధిలో శరీర రోగ నిరోధక వ్యవస్థ పక్కదారి పట్టి కంటి చుట్టూ ఉన్న కొవ్వు, కండరాలపై ప్రభావం చూపి అవి ఉబ్బేలా చేస్తుందన్నారు. దీనితో కళ్లు ఉబ్బినట్లుగా ఉండడం, వెడల్పుగా తెరుచుకొని ఉండడం, పూర్తిగా మూసుకోవడంలో ఇబ్బందులు, ద్వంద్వ దృష్టి, తీవ్రమైన కేసుల్లో దృష్టి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు కంటిలో అసాధారణ మార్పులు గమనిస్తే వెంటనే వైద్యసాయం పొందాలన్నారు.

ట్రిపుల్ ఐటికి 34 మంది ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని ఎపి బాలికల గురుకులం, కెజిబివి, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జెడ్‌పి, జివిఎంసి ఉన్నత పాఠశాలలకు చెందిన 34 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. 18 మంది ఎపి బాలికల గురుకుల విద్యార్థినులు, బాలికల పాఠశాలకు చెందిన ముగ్గురు, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు, జివిఎంసి హైస్కూల్‌కు చెందిన ఒకరు, చిట్టివలస జెడ్‌పి బాలుర పాఠశాలకు చెందిన నలుగురు, తాళ్లవలస జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు, మజ్జివలస, మజ్జిపేట జెడ్‌పి హైస్కూళ్లకు చెందిన ఒక్కొక్కరు, కెజిబివికి చెందిన ఒకరు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారన్నారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశానికి వీరు అర్హత సాధించారన్నారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇంటింటికి చెత్త సేకరణ విజయవంతం కావాలంటే ప్రజల్లో అవగాహన అవసరమని జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం గొట్టిపల్లి గ్రామ పంచాయతీలో తడిపొడి చెత్త సేకరణపై గ్రామస్థాయిలో అవగాహనలో పాల్గొన్నారు. ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి, గ్రీన్ అంబాసిడర్లకు అప్పగించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ బి. జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, స్థానిక నాయకులు రాజు, పెంటబాబు పాల్గొన్నారు.

జివిఎంసి 'తాగునీటి' కార్మికుల సమ్మె

తొలిరోజు పలుచోట్ల సరఫరాకు అంతరాయం

గాజువాకలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పెంచిన వేతనాన్ని చెల్లించాలని కోరుతూ జివిఎంసి తాగునీటి సరఫరా విభాగం కాంట్రాక్టుకార్మికులు శుక్రవారం సమ్మెకు దిగారు.నగర పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాశక్తి- సీతమ్మధార: వేతన సమస్య పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సీతమ్మధార సెక్షన్ నీటి సరఫరా విభాగం వైస్ ప్రెసిడెంట్ గురు సాగరమూర్తి స్పష్టం చేశారు. స్థానిక నీటి సరఫరా విభాగం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. జివిఎంసి కౌన్సిల్ తీర్మానం మేరకు నీటి సరఫరా విభాగం అన్‌స్కిల్డ్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు రూ.15వేలు నుంచి రూ.18,500, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.18,500 నుంచి రూ.21,500 చెల్లిస్తామన్న ఒప్పందాన్ని అమలు చేయకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ట్రెజరర్, సీతమ్మధార సెక్షన్, వైస్ ప్రెసిడెంట్, కుమార్ శ్రీరామమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్,సెక్రటరీ గురునాథరావు, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, హరీష్, ట్రెజరర్ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఉక్కునగరం/గాజువాక: పెంచిన వేతనాలు చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద, అగరంపూడి సమీపంలోని 85ఎంఎల్‌డి వాటర్ సప్లై అవుట్సోర్సింగ్ ఉద్యోగులు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగారు. కార్యక్రమంలో సాగి సునీల్, పి గోవిందా, దుగ్గపు దానప్పలు, కృష్ణ, భాస్కర్ రాజు, రామకృష్ణ రాజు, రాఘవ ,సూరిబాబు, పల్లా అప్పలరాజు, శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి రెండోజోన్‌లో నీటిసరఫరా కార్మికులు సమ్మెకు దిగారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.దుర్గా ప్రసాద్, ఎండాడ సెక్షన్ ప్రెసిడెంట్ చిన్న రావు, వైస్ ప్రెసిడెంట్, సతీష్,సెక్రటరీ రవి గారు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్ ఇతర కార్మికులు పాల్గొన్నారు

వేపగుంట : జీవీఎంసీ ఎనిమిదో జోన్ పరిధిలోని 60మంది మంచినీటి సరఫరా విభాగం కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు దిగారు.కౌన్సిల్లో తీర్మానం మేరకు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు

గోపాలపట్నం : జివిఎంసి 90 వార్డు బుచ్చిరాజుపాలెం ఎపిఎస్ఇబి కాలనీ వద్ద తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో జోన్ పరిధిలోని పలువార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో మంచినీటి విభాగం కార్మికులు పాల్గొన్నారు.

కెజిబివి ప్రిన్సిపల్‌కు రాజకీయ వేధింపులు

- 6వ తరగతి సీటు కోసం అధికార కూటమిలోని రెండు గ్రూపుల వారు ఒత్తిడి
- ఎమ్మెల్యే ఆఫీసులోనే స్పృహ తప్పి పడిపోయిన వైనం
- టిడిపి నేతల వర్గపోరులో నలిగిపోతున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-వడ్డాది

అధికార టిడిపి కూటమి నాయకుల వేధింపులకు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణపై కూటమి నాయకులు వ్యవహరించి తీరుతో ఆమె స్పృహ తప్పి పడిపోయిన ఘటన శుక్రవారం సాక్షాత్తూ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలోనే చోటుచేసుకుంది.

వడ్డాది కేజీబీవీలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. డ్రాప్ అవుట్ కారణంగా ఒక సీటు ఖాళీ ఏర్పడింది. ఈ సీటు కోసం ఇటు ఎమ్మెల్యే రాజు గ్రూపువారు, అటు టిడిపి జిల్లా అధ్యక్షుడు, స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు గ్రూపువారు పోటీపడ్డారు. కొంతకాలంగా వడ్డాదిలో ఎమ్మెల్యే రాజు, తాతయ్య బాబు వర్గీయుల మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. ఈ నేపథ్యంలో కేజీబీవీ సీటు కోసం ఇరు గ్రూపుల వారు కేజీబీవీ ప్రిన్సిపల్‌పై ఒత్తిడి తెచ్చారు. అయితే తాతయ్యబాబు సిఫారసు చేసిన బాలికకు కేజీబీవీ చైర్మన్, ప్రిన్సిపల్ సీటు ఇచ్చి చేర్చుకున్నారు. ఇది ఎమ్మెల్యే గ్రూపు వారికి రుచించలేదు. స్థానిక జనసేన యూత్ లీడర్ షేక్ రసూల్ గురువారం వడ్డాది కేజీబీవీలోకి వెళ్లి ప్రిన్సిపల్ అన్నపూర్ణపై చిందులు తొక్కారు. అంతే కాకుండా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే తన కార్యాలయానికి రావాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణకు కబురు పంపారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, చైర్మన్ సత్యవేణి రామ్మూర్తి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అప్పటికే ఎమ్మెల్యే గ్రూపునకు చెందిన కూటమి నాయకులు ఉన్నారు. ఆరో తరగతి సీటు విషయమై ఎమ్మెల్యే రాజుతో పాటు కూటమి నాయకులు ప్రిన్సిపాల్ అన్నపూర్ణను నిలదీయడంతో భయాందోళన గురైన ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే ఆమెను వారే స్వయంగా చోడవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

విద్యాలయాల్లో కూటమి నేతలు రాజకీయాలు చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలికలు చదువుకునే పాఠశాలలోకి వెళ్లి ప్రిన్సిపల్‌ను బెదిరించిన జనసేన నేత షేక్ రసూల్ తీరుపై మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అధికార కూటమి నేతలు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డాదిలో సచివాలయ సిబ్బందిపై కూటమి నేతలు తరచూ చిందులు తొక్కుతున్నారు. మహిళా ఉద్యోగులు వడ్డాదిలో పని చేయడానికి భయపడుతున్నారు. కూటమి నేతల వేధింపులు భరించలేక కొంతమంది సెలవు పెట్టి వెళ్లిపోవడానికి, బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల వేధింపులు కారణంగా ఖాళీ అయిన పోస్టులు భర్తీ కావడం లేదని సమాచారం.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెజిబివి ప్రిన్సిపల్ అన్నపూర్ణ

పోలీసు, రవాణా శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

లంకెలపాలెంలో రోడ్డు సేఫ్టీపై ఎస్‌పి సమీక్ష

ప్రజాశక్తి-పరవాడ : లంకెలపాలెం కూడలిలో జూన్ 23 రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో రోడ్ సేఫ్టీ పరిరక్షణ చర్యలపై, రోడ్ ఇంజినీరింగ్‌లో తగిన మార్పులు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, డీఎస్పీ వి.విష్ణు స్వరూప్‌తో కలిసి శుక్రవారం ఘటన స్థలంలో సమీక్ష నిర్వహించారు. ప్రమాద స్థలంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, వేగ నియంత్రణ, సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ, ప్రమాదకరంగా ఉండే మలుపులు, డివైడర్లు, సైన్ బోర్డుల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించి తగిన సూచనలు జారీ చేశారు. రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.ప్రవీణ్ కుమార్, పి.గోపికృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా పిల్లా హర శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా సుంకర శ్రీనివాసరావు, సెక్రటరీగా బంధం వెంకట రమణ, జాయింట్ సెక్రటరీగా మల్ల జగపతి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా మోహన్, కోశాధికారిగా సందీప్, లైబ్రరీ సెక్రటరీగా శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా కుసుమ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సాయిరాం ప్రభాకర్ వ్యవహరించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో ఎంవి.సువర్ణరాజు శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని హరిత రాయబారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌కెవి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అనంత ఉమాదేవి పాల్గొన్నారు.

జాగృతి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-సబ్బవరం : జాగృతి సంస్థ అభివృద్ధికి తాము అన్ని వేళల సహకరిస్తామని నాబార్డ్ జిల్లా అధికారి జి.సమంత్ కుమార్ అన్నారు. మండలంలోని గొట్టివాడ దరి ఒక ప్రైవేటు కళ్యాణ మండపంలో శుక్రవారం జాగృతి సంస్థ 30వ ప్రాతినిధ్య మహాజన సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా నాబార్డ్ జిల్లా అధికారి జి.సమంత్ కుమార్, అనకాపల్లి జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంఎ రహీమ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం 30వ వార్షిక నివేదికను నాబార్డ్ డిడిఎం సమంత్ కుమార్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలు తెలియజేశారు. అనంతరం సంస్థ సీఈఓ కందర్ప లక్ష్మీ నీరజ మొత్తిక సంస్థ 30 ఏళ్ల అభివృద్ధిని భవిష్యత్ ప్రణాళికను సభలో సభ్యులకు తెలియజేశారు. సంస్థ ఆడిటర్ వి. సుధాకర్ వార్షిక లెక్కలు సభ్యులకు వివరించారు. సంస్థ సభ్యులందరికీ వివిధ రకాల నూతన పథకాలను ఆవిష్కరించి సభ్యులకు అందజేశారు. నూతనంగా ముగ్గురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జాగృతి సంస్థ అధ్యక్షులుగా మారేడుబూడి అబద్దం, వైస్ ప్రెసిడెంట్‌గా కోటాన సుజాత, మేనేజింగ్ డైరెక్టర్‌గా కందర్ప సుజాతను సభ్యులందరూ మహాజన సభలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ పాలక వర్గ సభ్యులు, రైతు కంపెనీల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక నివేదికను విడుదల చేస్తున్న దృశ్యం

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు ఆదేశించారు. ఈ మేరకు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదాములను తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. గోదాముల లోపల ఉన్న ఈవిఎంలను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో అర్థిఓ మాట్లాడారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌డిఓ షేక్ అయిషా, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, టిడిపి, బిజెపి, వైసిపి, ఆప్, సిపిఎం తదితర పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, వి.రమేష్, జె.రమేష్, కె.హరినాధబాబు, ఆర్.శంకర రావు, విద్యుత్ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఎంపికైన వారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చోడవరం : నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికైన ఆర్థికంగా ఇబ్బందిలో వున్న ముగ్గురు విద్యార్థినులకు చోడవరం పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహం అందజేశారు. విద్యార్థులు వేపలపు శ్రీలక్ష్మి, షేక్ అమీర్ ఉనీషా, జొన్నాడ యశశ్రీకి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున పూసల రామారావు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వీరన్న పంతులు, శాకా రమేష్ (బ్యాంక్), పసుమర్తి సీతారామయ్య, ఆర్క్ ప్రసాద్, వజ్జుల ప్రకాశరావు, సెక్రటరీ టివి రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవోదయకు మణికంఠ ఎంపిక

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది అక్షర స్కూల్లో చదువుతున్న చిన్నప్పన్నపాలెం గ్రామానికి చెందిన చల్లా మణికంఠ జవహర్ నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. ఇటీవల విడుదలైన రెండవ జాబితాలో మణికంఠకు నవోదయ సీటు లభించింది. దీంతో మణికంఠను స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అక్షర స్కూల్ కరస్పాండెంట్ టి.వరప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

భూసర్వే డిటిగా త్రిమూర్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల భూ సర్వే ఉప తహశీల్దారుగా జె.త్రిమూర్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎలమంచిలి నుండి ఇక్కడకు బదిలీపై వచ్చిన త్రిమూర్తులు గతంలో ఎన్నికల అధికారిగా పనిచేశారు. ఇక్కడ సర్వే ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.నూరి, ఎస్.రాయవరం బదిలీపై వెళ్లారు. ప్రజల సహకారంతో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని త్రిమూర్తులు తెలిపారు.

చిట్టీల పేరుతో భారీ మోసం

- రూ.5 కోట్లతో పరారీ
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

నిందితురాలు పద్మ

చిట్టీల పేరుతో ఒక మహిళ భారీ మోసానికి పాల్పడింది. గ్రామంలో ఎంతో నమ్మకంగా వ్యవహరించి ప్రతి ఒక్కరి చేత చిట్టీలు కట్టించి సుమారు రూ.5 కోట్లతో ఉడాయించింది. బాధితులంతా గగ్గోలు పెడుతూ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని చౌడువాడ శివారు గురుగుబిల్లికి చెందిన పెదిరెడ్ల పద్మజ అలియాస్ చల్లపల్లి పద్మకు సామర్లకోటకు చెందిన శ్రీనుతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త చనిపోవడంతో 15 ఏళ్ల కిందట చౌడువాడకు వచ్చి స్థిరపడింది. అప్పటి నుండి గ్రామస్తులతో పరిచయాలు పెంచుకొని చీటీల వ్యాపారం నిర్వహించింది. గ్రామంలో పండగలకు ఇతర కార్యక్రమాలకు భారీగా విరాళాలు ఇస్తూ నమ్మకం పెంచుకుంది. ఒకపక్క లక్షల్లో చిట్టీలు నిర్వహిస్తూ మరోపక్క మహిళలను ఆకర్షించి పప్పులు చీటీలు, వరలక్ష్మీ వ్రతం పేరుతో బంగారు కాసుల చీటీలను ప్రారంభించింది. క్రమంగా రూ.20 లక్షల చిట్టీలు కూడా వేసింది. నమ్మకం కలిగిన వారు చిట్టీల పాట పాడిన మొత్తాన్ని కూడా వడ్డీకి తిరిగి ఆమెకే ఇచ్చేవారు. ఇలా రూ.5కోట్ల వరకు వసూలు చేసింది. వారం రోజులు కిందట ఆరోగ్యం బాగోలేదని కుమారుడుతో సహా ఇంటి నుంచి వెళ్లిన పద్మజ తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో బాధితులకు అనుమానం కలిగింది. అంతకుముందు బ్యాంకులో కుదువ పెట్టిన రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు పరారయ్యే ముందు విడిపించుకుని పట్టుకుపోయినట్లు బాధితులు చెబుతున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉండే చౌడువాడకు చెందిన ఒక వ్యక్తికి ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన సుమారు 200 మంది బాధితులు లబోదిబో మంటూ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడును వెంటబెట్టుకుని కె.కోటపాడు ఎస్సై ధనుంజయను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు వంటి అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ డిఆర్ఓ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. బియల్ఎల ఓటరు జాబితాలో మార్పుల చేర్పులపై అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని ఈఆర్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలకు సంబంధించిన అభ్యంతరాలు, సమస్యలు ఉంటే తమకు తెలిపాలన్నారు. జూన్ 30వ తేదీ నాటికి మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులకు నివేదిక ఇచ్చినట్లయితే జులై 21వ తేదీ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. ఆ జాబితాపై అభ్యంతరాలు జులై 30వ తేదీలోపు స్వీకరిస్తామన్నారు. ఆగస్టు 2న పోలింగ్ కేంద్రాల మీద ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీ నేతలు లేవనెత్తిన సందేహాలను డిఆర్ఓ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, టిడిపి, బిజెపి, వైసిపి, ఆప్, సిపిఎం తదితర పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, వి.రమేష్, జె.రమేష్, కె.హరినాధబాబు, ఆర్ శంకరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న బొలెరో వాహనం

- డ్రైవర్, మహిళ దుర్మరణం
- మరో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జమాదులపాలెం జాతీయ రహదారి జంక్షన్ వద్ద గురువారం రాత్రి ఆగిన వున్న లారీని వెనుక నుండి కూరగాయలు లోడుతో వెళుతున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్, మరో మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. కశింకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం... కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మి (40), అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామానికి ఎన్.వరలక్ష్మి (40) పూలు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నుండి కూరగాయలు, పువ్వులను ఎపి 39 యుఎం 9180 నెంబర్ గల బొలెరో వాహనంలో తీసుకొస్తున్నారు. కశింకోట మండలం జమాదుల పాలెంజంక్షన్ వద్ద గురువారం రాత్రి సుమారు ఒంటి గంట 45 నిమిషాల సమయంలో రోడ్డుపై ఆగివున్న లారీని వీరి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బొలెరో వాహనం డ్రైవర్ పి.సత్యనారాయణ (25), కన్నూరు లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ఎన్.వరలక్ష్మికి తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న కసింకోట పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వరలక్ష్మిని విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై కన్నూరు వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ సత్యనారాయణ, కన్నూరు లక్ష్మి (ఫైల్‌ఫోటోలు)

ఫిర్యాదులు స్వీకరిస్తున్న బాబీ తదితరులు

అర్హులైన పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అర్హులైన పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో టిడిపి శ్రేణులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తుందన్నారు. దిబ్బపాలెం రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరగా శాసన సభ్యులు, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబారి శ్రీను, మేడిశెట్టి నూకరాజు, మెయ్యి నూకరాజు, షేక్ బాబర్, మధుపాడ నరసింగరావు, కరణం శ్రీను, గొర్లి శ్రీనివాసరావు, గజ్జి శ్రీనివాసరావు, చిదిరెడ్డి ప్రసాద్, నూకరాజు పాల్గొన్నారు.

భోగాపురంలో జిల్లాస్థాయి రగ్బీ పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని భోగాపురం గ్రామంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు శుక్రవారం అనకాపల్లి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను జడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా నలుమూలలకు చెందిన 18 జట్లు పాల్గొన్నాయి. పోటీలలో విజేతలకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కె వెంకు నాయుడు, ఎయిడ్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జగదీష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో బాలికల విభాగంలో జిల్లా ఛాంపియన్‌గా విఆర్ స్పోర్ట్స్ క్లబ్, రన్నర్స్‌గా అచ్యుత స్కూల్, తృతీయ స్థానంలో శ్రీభవాని విద్యానికేతన్ క్రీడాకారులు నిలిచారు. బాలుర విభాగంలో చాంపియన్స్‌గా విఆర్ స్పోర్ట్స్ క్లబ్, ద్వితీయ స్థానంలో అచ్యుత స్కూల్, తృతీయ స్థానాల్లో కెట్స్ జూనియర్ కాలేజ్ నిలిచాయి. ఈ కార్యక్రమంలో రెడ్డి గణేష్, డాక్టర్ వెంకట్ శ్యాంప్రసాద్, కోచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా, పరవాడ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కె.రాముునాయుడుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూపంలో కూడగట్టిన రూ.4,04,965 నగదు చెక్కును ఎస్పీ తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.రామ్ కుమార్, సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

అభయ వెంకటేశ్వరస్వామికి అభిషేకం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని బొనంగి ఫార్మసిటీ పునరావాస కాలనీ కొండపై ఉన్న శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి 108 కళశలతో అభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరికృష్ణ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామ గోవిందరావు, లాలం అప్పలనాయుడు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, సత్యనారాయణ, నారాయణ, నాయుడు, ధనరాజు, లోవరాజు, శేఖర్, దీపిక దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కళశలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

వైభవంగా జగన్నాథ రథయాత్ర

విశాఖలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టౌన్ కొత్త రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి తొలి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. ఆలయం నుంచి టర్నర్ సత్రం వరకు మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథయాత్ర సాగింది. తొలుత విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లు స్వామి వారికి పూజలు నిర్వహించారు. తాడు లాగి రథయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ అన్నపూర్ణ, శ్రీ జగన్నాథ స్వామి ఆలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఇస్కాన్ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభు ఆధ్వర్యంలో జివిఎంసి సెంట్రల్ పార్క్ వద్ద రథయాత్ర ప్రారంభమై వీధులగుండా సాగింది. మాతాజీ నితాయ్ సేవిని రథం ముందు కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : శ్రీ సుభద్ర బలభద్ర జగన్నాథ స్వామి రథ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు స్వామివారి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి సూర్యనారాయణ నాగ జగదీష్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీభోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, టిడిపి నాయకులు మల్ల గణేష్, బుద్ద లక్ష్మీ అప్పారావు, బుద్ద విశ్వనాథం, దాడి గోవింద, దాడి వాసు, యలమంచిలి బంగార్రాజు, కూరగాయల వర్తకులు మల్ల జగ్గప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగుల గ్రామంలో జగన్నాథస్వామి రథ మహోత్సవాన్ని శుక్రవారం కన్నులు పండుగగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేటి స్వామి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి లావణ్య స్వామి వారిని దర్శించుకున్నారు.

రథోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : స్థానిక దిబ్బవీధిలో జగన్నాథస్వామి రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భీమరశెట్టి రాంకీ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం రథోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. స్వామివారిని దర్శించుకుని, దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించి రథోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్ల పనులు తక్షణమే పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వి.మాడుగుల నియోజకవర్గం పరిధి శంకరం పంచాయితీలో తాడివలస, గొప్పూరు, రాజాంపేట, వెలంపాడు, కొత్తవలస, రావిపాలెం, మామిడి పాలెం, గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణానికి అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి ప్రభుత్వం రూ.9,20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి ఎర్త్ వర్కులు, కొన్ని బ్రిడ్జి పనులు చేశారని, అయితే వారికి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. వాలాబు పంచాయతీ పరిధి పూలగరువు, రామన్నపాలెం, బుచ్చంపాలెం, బొడ్డగుమ్మి, కోనాం, కోడపల్లి, బొర్రచింత, తుమ్మలపాలెం గ్రామాలకు రూ.12 కోట్లుతో పనులు చేసే కేవలం రూ.40 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారని తెలిపారు. వీరభద్రపేటకు రూ.84 లక్షలతో బిటి రోడ్డు మంజూరు కాగా, ఎర్త్‌వర్క్ చేసి రోడ్డు నిర్మాణం నిలిచి పోయిందని పేర్కొన్నారు. నేరెళ్లపూడి, బోడిగరువు, మదనగరువు గ్రామాలకు రూ.1.90 కోట్లుతో మంజూరైన రోడ్డు మధ్యలో ఆగిపోయాయని తెలిపారు. దీంతో రానున్న వర్షా కాలంలో గిరిజనులకు తిప్పలు తప్పేలా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 168 కిలోమీటర్ల పొడవున 1,364 రోడ్ల నిర్మాణం పనులు పూర్తి అయ్యాయని, వీటికి రూ.153 కోట్లు కాంట్రాక్టర్లు ఖర్చు చేశారని, ఇంత వరకు ప్రభుత్వం రూ.11.50 కోట్లు మాత్రమే చెల్లించిందని తెలిపారు. తక్షణమే ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను పూర్తి చేసి గిరిజనుల కష్టాలు తీర్చాలని వెంకన్న డిమాండ్ చేశారు.

మోడల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన మోడల్ స్కూళ్లలోను, ఉన్నత పాఠశాలలలోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలని బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. ఈ పాఠశాలల్లో గదులు, ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు వనమాల నాగభూషణంతో కలిసి ఎంఇఒ కోటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.

ఆర్ఎస్‌కెల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో వారి సాగు చేస్తున్న రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం నాయకులు శుక్రవారం స్థానిక తహశీల్దారు, వ్యవసాయశాఖ అధికారికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడటం వలన రైతులు వరి నారిమళ్ల సిద్ధం చేసుకున్నారని తెలిపారు. విత్తనాలు కోసం రైతు సేవా కేంద్రాలకు వెళితే గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాదారు పాసు పుస్తకాలు చెల్లవని, పాత పట్టాదారు పాస్ పుస్తకాలు తెస్తే ఇస్తామని అగ్రికల్చర్ అసిస్టెంట్లు చెప్పడం దారుణమన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఏ ప్రభుత్వం ఇచ్చినా రెవెన్యూ అధికారులు మంజూరు చేశారని పేర్కొన్నారు. రైతులను ఇబ్బంది పెట్టి విత్తనాలు సకాలంలో ఇవ్వకపోతే పంట అదును దాటిపోతుందని, రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఏ పాసు పుస్తకం ఉన్నా కూడా వారందరికీ వరి విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడుబాబు, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ, మండల ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, రొంగలి దేవుడు పాల్గొన్నారు.

నేడు డైట్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంబిఎ, ఎంటెక్) పూర్తి చేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఈనెల 28న శనివారం స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా ఈఎన్ఎస్‌టిఎల్, ఐఈఈఈ వైజాగ్ బే సెక్షన్ సైంటిస్ట్ డాక్టర్ సిహెచ్ అనిల్ కుమార్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు.

రేపు యాదవ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పదో తరగతిలో 550 పైన, ఇంటర్మీడియట్‌లో 900 పైన మార్కులు సాధించిన యాదవ విద్యార్థినీ విద్యార్థులకు అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న స్థానిక నూకాంబిక ఆలయ సమీపంలో సత్య లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం అధ్యక్షులు పంచదార్ల కన్నారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామంలో రామ కోవెల వద్ద శుక్రవారం 'సామాజిక వారధి' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో వృద్ధులు, మహిళలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆపరేషన్ చేసేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్లా లక్ష్మీనాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, సామాజిక వారధి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : భవన నిర్మాణాల పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఎస్ఇజెడ్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు చెప్పారు. హాస్పిటల్ భవన నిర్మాణ పనులలో పనిచేస్తున్న కార్మికులకు దోమ తెరలు పంపిణీ చేశారు.

రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాల్సిందే : సిపిఎం

మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో ఇళ్లు లు కోల్పోతున్న వారి కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ 25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, లేనిపక్షంలో నిర్వాసితులతో కలిసి పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు తెలిపారు. బుచ్చి రాజుపేట పంచాయతీ కొత్తూరులో శుక్రవారం జరిగిన నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నక్కపల్లి మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ చేపట్టిన భూసేకరణలో బుచ్చిరాజుపేట కొత్తూరు, చందనాడ పంచాయతీలో కర్రి వారివీధి, తమ్మయ్యపేట, తుమ్మలపేట, అమలాపురం పంచాయతీ పాటిమీద, మూలపర్ర, రాజయ్యపేట పంచాయతీ బోయపాడు గ్రామాల నిర్వాసితులను మండలంలో పెద్దబోదుగల్లం రెవెన్యూ పరిధిలో పునరావాసం కల్పించి అక్కడకు తరలిస్తామని అన్నారన్నారు. తరలింపు గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఇప్పుడు కేవలం 5 సెంట్లు ఇంటి స్థలం, 8 లక్షల 98 వేలు మాత్రమే ప్యాకేజీ ఇస్తామని అధికారులు ప్రకటించారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. భూములు తీసుకునే టప్పుడు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, అన్ని విధాలా ఆదుకుంటామని అరచేతిలో స్వర్గం చూపించిన అధికారులు ఇప్పుడు ఈ విధంగా మోసం చేయడం న్యాయం కాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 8 లక్షల 98 వేలతో ఇప్పుడు పెరిగిన నిర్మాణ సామాగ్రి ధరలును బట్టి చూస్తే వేరే చోట కనీసం పునాది కూడా నిర్మించుకోలేమని నిర్వాసితులు ఆవేదన వెలిబుచ్చారు. ఇక్కడ భూములు, ఇళ్లులు త్యాగం చేసామని, తమ త్యాగాలను ప్రభుత్వం, అధికారులు గుర్తించకపోవడం చాలా అన్యాయం అని అన్నారు. తమ త్యాగాలను గుర్తించి, న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు ఎం.బాబ్జీ, ఎం.ప్రసాద్,వై అప్పారావు, ప్రసాద్, వెంకటేష్, శ్రీను,మంగ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం లోపుడి-2, వడ్డాది-5, 6 అంగన్వాడీ కేంద్రాలను అనకాపల్లి జిల్లా ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలోని స్టాక్ రిజిస్టర్లను, స్టాకును, విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్దేశిత మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని, అంగన్వాడి కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల పేర్లతో ఫోటోలు ప్రతి సెంటర్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఓల్డ్ స్టాక్ వస్తే తిరిగి పంపించాలన్నారు. మెనూ అమలులో పొరపాట్లు జరిగితే సహించేది లేదని తెలిపారు. పోషణ ట్రాక్టర్‌లో ఎఫ్ఆర్ఎస్ 100శాతం చేయాలని, లేని యెడల లబ్ధిదారులకు జూలై 1 నుంచి స్టాక్ రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఐసిడిఎస్ పిఓ మంగతాయారు, సూపర్వైజర్ నిర్మల దేవి, అంగన్వాడి కార్యకర్తలు రాధాలక్ష్మి, జ్యోతి, మణి, శివమ్మ, స్థానిక ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగి సమస్యను తెలుసుకుంటున్న సిబ్బంది

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలోని పుత్తడిగైరం పేట గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గొలుగొండ పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్‌విస్.ప్రసాద్ గ్రామంలో 56 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు -ఘనంగా మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నూతన కార్యవర్గంతో అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం:నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గా గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ గా కన్నయ్య నాయుడు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో కమిటీ బాధ్యతలను శుక్రవారం వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతు సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు సరసమైన ధరలు రైతులకు లభించే విధంగా కమిటీ పని చేయాలన్నారు. రాష్ట్రం లేదా కేంద్ర నుంచి వచ్చే మార్కెట్ సంబంధిత మార్గదర్శకాలను అమలు చేయడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు, అనంతరం 20 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకరణ చేయించారు.కమిటీ చైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, స్పీకర్ సతీమణి పద్మావతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జడ్పిటిసి సభ్యురాలు రమణమ్మ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, జనసేన నియోజకవర్గం ఇన్చార్జి రాజన్న వీర సూర్యచంద్ర, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, ఆర్డీవో వివి రమణ, వ్యవసాయ శాఖ ఏడి శ్రీదేవి, తహసిల్దార్ రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, నాలుగు మండలాల నాయకులు అధికారులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో శుక్రవారం ఆయన శానిటేషన్ పనులను పరిశీలించారు. తడి పొడి చెత్త సేకరణ పై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. ఇంటింటా అవగాహన కల్పించి తడి పొడి చెత్తను ప్రతిరోజు సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అనంతరం వాటర్ ట్యాంకు పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. సంపద కేంద్రం నిర్వహణపై పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

అల్లూరి జయంతి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:జులై 4వ తేదీన జరిగే విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఏర్పాట్లు కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ, పర్యాటకశాఖ అధికారులతో కలిసి ఈ ఏర్పాట్లను పరిశీలించారు. జయంతిలోపు పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూగజీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

చీడికాడలో మందు వేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- చీడికాడ:చీడికాడతో పాటు, ఎల్. బి. పట్నం, తురువోలు గ్రామాలలో గొర్రెలు, మేకలకు ఉచితముగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు శుక్రవారం చిట్టి నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రాఘవమ్మ మాట్లాడుతూ, ఈ నట్టల నివారణ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాలలో జులై 10 వరకు జరుగుతుందన్నారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు గ్రామ రైతు సేవా కేంద్రం లోని పశు సంవర్ధక సహాయకులను, పశు వైద్య శాలను గాని సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీడికాడ సర్పంచ్ సామాలమ్మ, వైస్ సర్పంచ్ రొంగలి లక్ష్మి, పోతల రమణమ్మ పశు వైద్యాధికారి పశు వైద్య సహాయకులు మనోజ్, సంతోష్ పాల్గొన్నారు.

రోలుగుంట:రోలుగుంట గ్రామంలో శుక్రవారం పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ మాట్లాడుతూ, పాడి రైతులు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రుత్తల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు ఏకా సత్తిబాబు, పశువైద్య సిబ్బంది పాల్గొవన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో గ్రామీణ పశు వైద్య కేంద్రం వద్ద శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కన్నూరుపాలెం పశు వైద్య అధికారి డయానా ఆధ్వర్యంలో 720 గొర్రెలు, 80 మేకలకు నట్టల నివారణ మందు పట్టించారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఉల్లింగల రమేష్, కూటమి నాయకులు ఆంధ్ర ప్రసాద్, కర్రి సత్యనారాయణ, జెవిఓ కరుణశ్రీ, సన్యాసిరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : గొర్రెలు మేకలకు సకాలంలో నట్టల నివారణ మందులను వేయించడం వలన రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని బుచ్చయ్యపేట పశు వైద్యాధికారిణిగా నూతనంగా విధుల్లో చేరిన జె.పద్మజ పెంపకం దారులకు సూచించారు. శుక్రవారం విధుల్లో చేరిన ఆమె నేతవానిపాలెం, చింతపాక తదితర గ్రామాల్లో గల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పి.నాగేశ్వరరావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో మందును వేస్తున్న వైద్యులు

గోదామును పరిశీలిస్తున్న మోహనరావు

రైతులందరికీ విత్తనాలు అందేలా చూడాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి- నక్కపల్లి:ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతులందరికీ వరి విత్తనాలు అందేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు అన్నారు. మండలంలో శుక్రవారం నక్కపల్లి, కాగిత, చినదొడ్డిగల్లు రైతు సేవా కేంద్రాలను సందర్శించి, వరి విత్తనాల నిల్వలను పరిశీలించారు. వరి విత్తనాలు విత్తనాలు కొరత లేకుండా చూడాలన్నారు. మండలంలో సుమారుగా 950 క్వింటాలు వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. డి ఎం ఏపీ సీడ్స్ సాయి, ఏ ఈ ఓ సాయి కుమారి పాల్గొన్నారు.

రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

డిప్యూటీ తహశీల్దార్‌గా రాజా

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం.రాజా శుక్రవారం భాద్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్.గా పని చేసిన లక్ష్మయ్య. స్థానిక కార్యాలయంలోనే ఎలక్షన్ డిటిగా బదిలీ కాగా చీడికాడ. డిప్యూటీ తహసీల్దార్ గా పని చేస్తున్న రాజా. ఇక్కడికి బదిలీ పై వచ్చారు. నూతనంగా భాద్యతలు స్వీకరించిన రాజా కు తహసీల్దార్ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరావు, విఆర్వోలు శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్ చేశారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట చేపడుతున్న ధర్నా శుక్రవారం ఎనిమిదవ రోజుకు చేరుకుంది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజులతో కలిసి దీక్షా శిబిరానికి నర్సింగరావు చేరుకొని కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విభాగంలలో పని చేస్తున్న కార్మికులకు రూ.13వేల చాలీ చాలని జీతంతో కుటుంబ పరిస్థితులు భారంగా మారాయని, పనికి తగ్గ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అత్యవసర విభాగం అయిన నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కు, టౌన్ ప్లానింగ్ మరియు ఇంజనీరింగ్ విభాగాల టెక్నికల్ వర్కర్స్ కు రూ.29,200, నాన్ టెక్నికల్ వారికి 24,500 రూ. వేతనం అమలు చేయాలన్నారు. 10సంవత్సరాలు పై బడిన ఇంజనీరింగ్, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా నిరసనలు చేపడుతున్నా కనీసం ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోతే పోరాట ఉధృతం చేసేందుకు సిద్ధమవుతామన్నారు. ప్రజలకు అత్యవసరమై మంచినీరు, కరెంటు, పార్కులు వంటి కీలక మైన డిపార్ట్మెంట్లో సేవలు అందిస్తున్నా ఔట్ సోర్సింగ్ పేరుతో శ్రమను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యూనియన్ నాయకులతో చర్చించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిస్కారం చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సంఘం (జేఏసీ) జిల్లా అధ్యక్షుడు గొర్రె మురళీకృష్ణ, కార్యదర్శి కరక మహేష్, నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు కరక రామకృష్ణ, యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర, పలువురు కార్మికులు శేఖర్, నాగేంద్ర, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నర్సింగరావు, కోటేశ్వరరావు, కార్మికులు

సర్వేను అడ్డుకుంటున్న రైతులు

నెల్లిపూడిలో భూసేకరణ సర్వే అడ్డగింత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో నెల్లిపూడిలో టౌన్ షిప్ ఏర్పాటు కోసం భూసేకరణ నిమిత్తం భూములు సర్వే చేసేందుకు శుక్రవారం సర్వే బృందం రాగా గ్రామ సర్పంచ్ సురేష్ వర్మ ఆధ్వర్యంలో రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టౌన్ షిప్ కోసం అదనంగా భూసేకరణ చేపట్టేందుకు ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసిల్దార్ నరసింహమూర్తి ఈనెల 24 మంగళవారం గ్రామసభ నిర్వహించగా, భూములు ఇచ్చేది లేదని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. అయినప్పటికీ అధికారులు సూచనల మేరకు సర్వేయర్ సత్తిబాబు, సర్వే బృందంతో కలిసి నెల్లిపూడి లో భూములు సర్వే చేసేందుకు వెళ్లగా, రైతులు అడ్డుకున్నారు. గ్రామసభలో భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేసినప్పటికీ, మరలా భూములు సర్వే చేసేందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదని , తమను కాదని సర్వే చేపడితే అడ్డుకుంటామని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. దీంతో సర్వే బృందం వెనుదిరిగింది.

స్మార్ట్ మీటర్లతో విద్యుత్ భారాలు : సిపిఐ

ప్రజాశక్తి-గొలుగొండ:స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లుల భారాలు ప్రజలపై మోసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో సిపిఐ మండల సమావేశం మర్రిబాబులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, అధాని, అంబానీ కార్పొరేట్ వ్యక్తులతో కేంద్ర ప్రభుత్వం గత జగన్ ప్రభుత్వంతో చేతులు కలిపి స్మార్ట్ మీటర్లు ఒప్పందం కుదుర్చుకున్నారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా దాన్ని కొనసాగిస్తోందన్నారు.ఎన్నికల హామీ భాగంలో సూపర్ సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకి అందడం లేదని ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, సీనియర్ నాయకులు మేకా సత్యనారాయణ, మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ, మహిళా సమాఖ్య కార్యదర్శి డి.భవాని పాల్గొన్నారు.

కదిలిన జిల్లా యంత్రాంగం

-అర్ల పంచాయతీలో పర్యటన
-విద్యార్థుల 10 కిలోమీటర్ల కాలినడకపై ఆరా
-సమస్య పరిష్కారానికి కృషి : డిఇఒ

ప్రజాశక్తి-రోలుగుంట:చదువుకోవాలంటే 10కిలో మీటర్లు నడిచి వెళుతున్న విద్యార్థుల దయనీయ స్థితిపై జిల్లా అధికారులు స్పందించారు. రోలుగుంట మండలం అర్ల పంచాయతీ కొండ శిఖర గ్రామమైన పెదగరువు, పాతలోసింగి, కొత్తలోసింగి పివిటిజి తెగ ఆదివాసీ గిరిజన ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో 328 మంది జనాభా కలిగి ఉన్నారు. వైబి.పట్నం గ్రామంలో ఎంపిపి పాఠశాలకు 32 మంది లోసింగి, పాతలోసింగి, పెద్దగరువు గ్రామం నుండి 23 మంది వెళుతున్నారు. వీరు పాఠశాలకు రానుపోను 10 కిలో మీటర్లు దూరంలో గల వైబి.పట్నంకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయమై పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు, తహశీల్దార్ నాగమ్మలు శుక్రవారం కాలినడకన కొండ ఎక్కి లోసింగి గ్రామానికి వెళ్లి అక్కడి గిరిజనులతో మాట్లాడారు. గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై డిఇఒ మాట్లాడుతూ, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందరావు, స్థానిక గిరిజన సంఘం నాయకులు కిలో నరసయ్య, వెంకట్రావు, కొండపాముల సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

గ్రామానికి వెళుతున్న జిల్లా అధికారులు, సిపిఎం నేత గోవిందరావు

షెడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తాత్కాలిక షెడ్డు. నిర్మాణం చేసేందుకు స్థానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి జూనియర్ కళాశాల పక్కనున్న ఐదు ఎకరాల స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. త్వరలో వసతి గృహం ప్రారంభం కావడంతో డిగ్రీ కళాశాల ను వేరే చోటికి మార్చాల్సి వుంది. దీంతో జూనియర్ కళాశాల పక్కన ఉన్న ఐదు ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే సమస్యలను ప్రిన్సిపల్ శాస్త్రీని అడిగి తెలుసుకున్నారు. వెంటనే తాత్కాలిక షెడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్ శ్రీనివాసరావును ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, టీడీపీ మండల కార్యదర్శి ఉండూరు దేముడు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వెళుతున్న వాహనదారులు

అస్తవ్యస్తంగా అప్రోచ్ రోడ్డు

- అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:జల్లూరు వంతెన వద్ద ఇటీవల నిర్మాణం చేపట్టిన అప్రోచ్ రోడ్డు చినుకు పడితే చాలు చిధ్రంగా తయారవుతుంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో వాహనాలు అదుపుతప్పి ఎక్కడ జారి పడిపోతాయేమోనని వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గడిచిన రెండు రోజులుగా చిరుజల్లుల కారణంతో రోడ్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. కొన్ని సందర్భాలలో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి రాత్రి సమయంలో మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్రోచ్ రోడ్డుపై వేసిన మట్టి బ్రిడ్జిపై చేరుకోవడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి, కొన్ని ప్రదేశాలలో వేసిన మట్టి వర్షానికి కొట్టుకు పోతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
VISAKHA HOSPITAL
విశాఖ హాస్పటల్ - ప్రజాశక్తి ఆధ్వర్యాన..
2025
జూలై 1న
(మంగళవారం)
9 AM To 1.30 PM
ఉచిత వైద్య శిబిరం
FREE MEDICAL CAMP
స్థలం : ప్రజాశక్తి కార్యాలయం, ప్లాట్ నెం.3,
జి-బ్లాక్, ఆటోనగర్, గాజువాక, విశాఖపట్నం
అందరికీ నమస్కారం,
మారిన పరిస్థితులు, జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం సవాలుగా మారింది. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుని సలహాలు తీసుకోవడం ఇప్పటి పరిస్థితుల్లో అనివార్యమైంది. వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి తరుణంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రజాశక్తి ఆధ్వర్యంలో విశాఖ హాస్పటల్ సౌజన్యంతో గాజువాక, ఆటోనగర్, జి-బ్లాక్, ప్లాంట్ నెం.3లో ప్రజాశక్తి కార్యాలయం నందు జూలై 01న మంగళవారం నాడు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ ఈ శిబిరం కొనసాగుతుంది. పలువురు వైద్య నిపుణులు సేవలు అందించనున్నారు. బిపి, సుగర్, ఇసిజి టెస్టులు చేసి తగిన సూచనలు, ఉచితంగా మందులు ఇవ్వనున్నారు. కావున ఫకీర్‌తక్యా, యాదవ జగ్గరాజుపేట, కాళింగ వీధి సమీప ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.
Dr. P.V.V. SANTHOSH KUMAR
Managing Director
విశాఖ హాస్పటల్,
దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు, కూర్మన్నపాలెం.
నమస్కారములతో...
ఎం.వెంకటేశ్వరరావు
జనరల్ మేనేజర్
ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై॥లి॥,
విశాఖపట్నం.
వివరాలకు 9490099125, 9490099127 నెంబర్లును సంప్రదించగలరు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో
మీ ప్రకటన
వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు,
బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు,
ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని
ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
రంపచోడవరం : 9440165617
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాధవధార : 9490099675